PRGI No. APTEL/2022/81596

janodaya
# జనోదయ
JANODAYA

కరీంనగర్ గురువారం 15.10.2026 : సంపుటి : 03 : సంచిక : 106 : పేజీలు : 04 వెల : రూ.5

Karimnagar Thursday 15.10.2026 : Volume: 03: Issue 106 : Pages 04 : Cost 5/

తెలుగు దినపత్రిక

## నాలుగో స్థానానికి శ్రేయస్ అయ్యర్



భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఐసీసీ టీ20 అంతర్జాతీయ బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో కెరీర్ బెస్ట్ ర్యాంకును అందుకున్నాడు. వెస్టిండీస్‌తో జరుగుతున్న ఐదు టీ20ల సిరీస్‌లో అదరగొడుతున్న సర్పంచ్ సాబ్.. తాజా ర్యాంకింగ్స్‌లో మూడు స్థానాలు ఎగబాకి 798 పాయింట్లతో నాలుగో స్థానానికి చేరుకున్నాడు. లఖ్‌నవూ వేదికగా జరిగిన తొలి టీ20లో శ్రేయస్ తన కెరీర్‌లోనే తొలి టీ20 అంతర్జాతీయ సెంచరీ సాధించిన విషయం తెలిసిందే.

4లో..

# సింగరేణిలో కాంగ్రెస్ స్కామ్‌లు

సింగరేణి బొగ్గును బుక్కిన బకాసురుడెవరు?.. బొగ్గును మాయం చేసిన మాయల ఫకీరెవరు?.. సింగరేణి కోల్‌ను గోల్‌మాల్ చేస్తున్న దొంగెవరు? .. సిరుల గనిని స్కామ్‌ల ఖనిగా మార్చిన దుర్మార్గుడెవరు?.. మూడేండ్లలో సింగరేణిలో బొగ్గు నిక్షేపాలు తగ్గినయా?.. కార్మికుల కష్టం తగ్గిందా? మరి బొగ్గెందుకు తగ్గింది?

- ధ్వజమెత్తిన కేటీఆర్





- మూడేండ్లలోనే సంస్థలో 10 వేల కోట్ల దోపిడీ
- సింగరేణి ప్రైవేటీకరణకు కాంగ్రెస్, బీజేపీ కుట్రలు
- రెండుపార్టీలు కలిసి అదానీకో, అంబానీకో అమ్ముతయ్
- సింగరేణి స్కామ్‌లపై బీజేపీ నేతలు నోరుమెదపరేం?
- కమీషన్లు ముడుతున్నయా.. కప్పం కడుతున్నరా?
- కార్మిక గర్జన సభలో బీఆర్ఎస్ వర్కింగ్ కేటీఆర్

3లో..

టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో బుధవారం గోదావరిఖనిలో నిర్వహించిన 'సింగరేణి కార్మిక గర్జన' సభకు పోటెత్తారు. సభకు ఒకరోజు ముందుగానే ప్రభుత్వం లాభాల వాటా ప్రకటించినా లెక్క చేయకుండా కేటీఆర్ మీటింగ్‌కు కదలి వచ్చారు. మూడేండ్ల కాంగ్రెస్ పాలనలో సింగరేణిని అవినీతిమయంగా మార్చడం, కార్మికుల సంక్షేమాన్ని గాలికొది లేయడం, ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం, సంస్థ ప్రైవేటీకరణకు కుట్రలు చేయడం, వంటి అంశాలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వివరించగా, ఆయనతో గొంతు కలుపుతూ 'సంస్థను నిర్వీర్యం చేసిన కాంగ్రెస్ సర్కార్‌ను వదిలిపెట్టేది లేదు' అంటూ నల్లసూర్యుడు సింహగర్జన చేశారు.

## గ్లోబల్ రైజింగ్ సమ్మిట్‌కు తరలిరండి

**'రైజింగ్ తెలంగాణ' లక్ష్యసాధనలో భాగస్వాములవ్వండి**

**'సమాఖ్య గ్లోబల్ బిజినెస్ మీట్-26'లో మంత్రి శ్రీధర్‌బాబు**



**హైదరాబాద్, అక్టోబరు 14 :** 'తెలంగాణ రైజింగ్ – 2047' విజన్‌కు అనుగుణంగా డిసెంబర్ 7 నుంచి 9 వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న 'తెలంగాణ గ్లోబల్ రైజింగ్ సమ్మిట్ 2026'లో పాల్గొనాలని పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలను మంత్రి శ్రీధర్‌బాబు కోరారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టి... 'రైజింగ్ తెలంగాణ' లక్ష్య సాధనలో భాగస్వామ్యం కావాలని ఆహ్వానించారు. సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన 'సమాఖ్య గ్లోబల్ బిజినెస్ మీట్ – 2026'కు ఆయన గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని తెలిపారు. ఇందుకోసం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి, నూతన పరిశ్రమలకు ప్రోత్సాహం, వ్యాపారాలకు అనుకూల వాతావరణం కల్పించడంపై దృష్టి సారించామన్నారు. ఐటీ, ఫార్మా, లైఫ్ సైనట?్ససతో పాటు ఏఐ, ఏరోస్పేస్, రక్షణ రంగం, అధునా తన తయారీ లాంటి రంగాలకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. రాష్ట్రంలో పెట్టు బడులు పెట్టేందుకు, పరిశ్రమలను విస్తరించేందుకు గ్లోబల్ రైజింగ్ సమ్మిట్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రేపు ఢిల్లీలో తిరంగా మార్చ్

**అసమ్మతిని అణచివేసేందుకు కేంద్ర ప్రభుత్వ యత్నం**

**జంతర్ మంతర్‌లో జాతీయ జెండా ఎగురేయడమే నేరమా?**

**దేశంలో అనధికారిక ఎమర్జెన్సీ.. సీజేపీ వ్యవస్థాపకుడు దీప్కే ఫైర్**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 14:** ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో ఉన్న సెంట్రల్ పార్క్‌లో ఈ నెల 16న 'లెహ్రాదో తిరంగా' (త్రివర్ణ పతాకాన్ని ఎగరవేయండి) పిలుపుతో కొత్తగా నిరసనలు చేపడతామని కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే బుధవారం ప్రకటించారు. పార్టీ సీనియర్ నాయకులు సౌరవ్ దాస్, ఆశుతోష్ రాంకాలను ఐదు రోజుల జ్యుడిషియల్ కస్టడీకి అప్పగించడం పై దీప్కే స్పందించారు. కేంద్ర ప్రభుత్వం అసమ్మతిని అణచివేస్తున్నదని ఆరో పించారు. ఆశు, సౌరవ్‌లను ఐదు రోజుల జ్యుడిషియల్ కస్టడీకి పంపారు. వారి తప్పేంటి? జంతర్ మంతర్ వద్ద త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడమే అని దీప్కే పేర్కొన్నారు. నరేంద్ర మోదీ..కొంచెం ధైర్యం చూపండి. అసమ్మతిని అణచివేయాలని మీకు అంతగా పట్టుదల ఉంటే ఇలాంటి పిరికిపంద చర్యల వె నుక దాక్కోవడం మానేసి అధికారికంగా అత్యవసర పరిస్థితిని ప్రకటించే ధైర్యం చేయండి అని దీప్కే సవాలు విసిరారు. అక్టోబర్ 16వ తేదీ సాయంత్రం 5 గంటలకు త్రివర్ణ పతాకంతో దేశభక్తులందరూ సెంట్రల్ పార్క్‌కు రావాలని కోరుతున్నాను. త్రివర్ణ పతాకం ఎగరవేయడం నేరం కాదని మనం నిరూపిద్దాం అని పేర్కొన్నారు.

# రాజకీయాలు అభివృద్ధికి ఆటంకం కావద్దు

ఎన్నికలప్పుడే రాజకీయాలు.. అభివృద్ధి విషయంలో ఆటంకం కావొద్దు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ హైటెక్స్‌లో బుధ వారం సమాఖ్య బిజినెస్ సమ్మిట్- 2026ను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ...సమాఖ్య అనే పదానికి చాలా బలం ఉంది అని అన్నారు.

- ప్రధాని వికసిత్ భారత్ లక్ష్యంగా పనిచేస్తున్నారు
- తెలంగాణను ప్రపంచ పెట్టుబడులకు గమ్యస్థానంగా తీర్చిదిద్దుతున్నాం
- మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి
- సమాఖ్య బిజినెస్ సమ్మిట్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్



వివరాలు...2లో..

## ముఖ్యమంత్రీ.. నేను మాట్లాడొద్దా?

**రేవంత్‌రెడ్డి స్పీచ్‌కు వీహెచ్ బ్రేక్**

**ప్రసంగం ఆపి వెనుదిరిగిన సీఎం**

**బిజినెస్ సమ్మిట్‌లో చేదు అనుభవం**




**హైదరాబాద్, అక్టోబర్ 14 :** సీఎం రేవంత్‌రెడ్డికి చేదు అనుభవం ఎదురైంది. ముఖ్యమంత్రి ప్రసం గాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్(హన్మంతరావు) అడ్డు కొని షాక్ ఇచ్చారు. ఊహించని ఈ పరిణా మంతో బిత్తరపోయిన సీఎం.. మాట్లాడకుండా వెనుదిరగడం చర్చనీయాంశమైంది. బుధవారం సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్ (సీఎస్ఎస్) ఆధ్వర్యంలో హైటెక్స్‌లో ఏర్పాటుచేసిన బిజినెస్ సమ్మిట్‌లో ఈ ఘటన చోటుచేసుకున్నది. సీఎం రేవంత్‌రెడ్డిని మాట్లాడాల్సిందిగా నిర్వాహకులు కోరడంతో మైక్ వద్దకు వెళ్లిన సీఎం స్పీచ్‌కు సిద్ధమయ్యారు. అంతలోనే వేదికపై ఉన్న వీహెచ్.. 'ముఖ్యమంత్రీ.. నేను మాట్లాడొద్దా..' అంటూ ప్రశ్నించారు. దీంతో రేవంత్‌రెడ్డి చేసేదేమీలేక వెళ్లి తన కుర్చీలో కూర్చొన్నారు. 'నా కోటా కూడా నువ్వే మాట్లాడు' అంటూ వెళ్లిపోవడం గమనార్హం.

## పాలకుడిని కాదు.. ప్రజా సేవకుడిని



4లో..

ఫారం-6 పెండింగ్ దరఖాస్తులు

# వారంలోగా పరిష్కరించాలి



●ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలి

●రాజకీయపార్టీలతో సమీక్షలో ఖమ్మం జిల్లా కలెక్టర్

**జనోదయ - ఖమ్మం ప్రతినిధి**

'ఎస్ఐఆర్ కార్యక్రమం'లో భాగంగా పెండింగ్‌లో ఉన్న నోటీసుల పంపిణీ, విచారణలను వేగంగా పూర్తి చేయాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లో రాజకీయపార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్, ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై జిల్లాకలెక్టర్ దివాకర సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో మొత్తం 1,75,841 నోటీసులలో ఇప్పటి వరకు 1,630 నోటీసులు పంపిణీ మాత్రమే పెండింగ్ ఉన్నాయని, 99.07 శాతం నోటీసులు పంపిణీ పూర్తయిందని తెలిపారు. 1,58,144 మందికి విచారణ పూర్తి చేశామని వెల్లడించారు. మిగిలిన విచారణలు నవంబర్ చివరినాటికి పూర్తి చేయాలని, ఓటర్ల నుంచి స్వీకరించిన పత్రాలు క్షుణ్ణంగా పరిశీలించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. నిబంధనలు, మార్గ దర్శకాలకనుగుణంగా అర్హులైన వారిని ఓటరు జాబితాలో చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఫారం-6కు సంబంధించి మొత్తం 6,435 దరఖాస్తులు పెండింగులో ఉన్నాయని తెలిపారు. వీ టి పరిష్కారంపై ఈఆర్‌ఓలు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పెండింగులో ఉన్న దరఖాస్తులను సమీక్షించి, వచ్చే వారంలోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. అర్హులైన దరఖాస్తుదారులకు ఇబ్బందులు కలగకుండా సత్వరచర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియలో ఇప్పటివరకు దాదాపు 27 వేల మంది నమోదు చేసుకున్నారని కలెక్టర్ తెలిపారు. గతంలో 84వేల మంది ఓటర్లుగా నమోదయ్యారని పేర్కొన్నారు. ఈసారి కనీసం 2లక్షల మంది ఓటర్లుగా నమోదు చేయాలని, నవంబర్ 6 ఓటరు నమోదు చివరితేదీ కావడంతో అర్హులైన గ్రాడ్యుయేట్లందరూ ఓటర్లుగా నమోదు చేసుకునేలా ప్రత్యేకచర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. నమోదు ప్రక్రియపై విస్తృత ప్రచారం నిర్వహించి, నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించేలా కృషి చేయాలని అన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు సంబంధించి అర్హతలు, దరఖాస్తు విధానం, నమోదు ప్రక్రియపై సామాజిక మాధ్యమాలు, పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా, కేబుల్ ఛానళ్ల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా అర్హులైన గ్రాడ్యుయేట్లకు అవగాహన కల్పించి, ఓటరు నమోదు ప్రక్రియలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి.శ్రీజ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీఓ ఎన్.శ్రీనివాస్, కలెక్టరేట్ ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ ఎంఏ రాజు, డీటీ అన్సారీ, వివిధ పార్టీల ప్రతినిధులు బి. వేణు గోపాల్, ఎం.రమేష్, ఎ.సతీష్ బాబు, అన్నెం గోపాల్ రావు, వి.రాజేష్, స్వర్ణ సుబ్బారావు, వేల్పుల రామయ్య, ఆర్.ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

## వెలిశాల గ్రామంలో పోలీస్ ప్రజా భరోసా

సిఐ నాగేశ్వర రావు



**జనోదయ : తిరుమలగిరి:**

సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండల పరిధిలోని వెలిశాల గ్రామంలో గ్రామ సర్పంచ్ కుంభం మంజుల సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం నాడు పోలీస్ ప్రజాభరోసా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతి థులుగా నాగారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు,తిరుమలగిరి ఎస్ఐ గుత్త వెంకట్ రెడ్డి పాల్గొని గ్రామ ప్రజలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో బెల్ట్ షాపులు మూసివేయాలని,అక్రమంగా మద్యం విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకోవా లని వారు హెచ్చరించారు. రాబోయే దసరా పండుగను గ్రామప్రజ లందరూ ప్రశాంతమైన వాతావర ణంలో సోదరభావంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జర గకుండా దసరాపండుగను అంద రు ఆనందంగా జరుపుకోవాలని వారు సూచించారు. గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల భద్రతకు ప్రతిఒక్కరూ పోలీసు లకు సహకరించాలని పోలీసు అధికారులు కోరారు.

## గాంధీ భవన్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ**

**కాట సుధా శ్రీనివాస్ గౌడ్**



**జనోదయ : పటాన్చెరు**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను గాంధీ భవన్‌లో తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పే బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుంది.

# రాజకీయాలు అభివృద్ధికి ఆటంకం కావద్దు




**ప్రధాని వికసిత్ భారత్ లక్ష్యంగా పనిచేస్తున్నారు**

**తెలంగాణను ప్రపంచ పెట్టుబడులకు గమ్యస్థానంగా తీర్చిదిద్దుతున్నాం**

**మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి**

**సమాఖ్య బిజినెస్ సమ్మిట్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి**

**జనోదయ, హైదరాబాద్, అక్టోబర్ 14:**

ఎన్నికలప్పుడే రాజకీయాలు.. అభివృద్ధి విషయంలో ఆటంకం కావొద్దు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ హైటెక్స్‌లో బుధవారం సమాఖ్య బిజినెస్ సమ్మిట్– 2026ను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సమాఖ్య అనే పదానికి చాలా బలం ఉంది అని అన్నారు.పురాతన కాలంలో వస్తు మార్పిడి పద్ధతి ద్వారా వ్యాపారం జరిగేదని..ఆధునిక యుగంలో నూ సమాఖ్యల అవసరం చాలా ఉన్నందువలన ఆధునిక కాలంలో వస్తున్న మార్పులను తెలుసు కోవడానికి, అంది పుచ్చుకోవడానికి సమాఖ్యలు ఉపయోగపడతాయి అని అన్నారు.కొత్త తరం అభివృద్ధికి ఈ కార్యక్రమం చాలా తోడ్పడుతుందన్నారు. సినిమా, రాజకీయ రంగాల్లో మున్నూరు కాపు సామాజిక వర్గం నుంచి వివిధ హోదాల్లో రాణించారని,ఉన్నత శిఖరాలకు ఎదగడమే కాదు.. అందరికీ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. 2047 నాటికి స్వతంత్ర భారతం వందేళ్లు పూర్తి చేసుకోబోతుంది అని,ప్రధాని మోదీ 2047 వికసిత్ భారత్ లక్ష్యంగా పనిచేస్తున్నారు అని తెలిపారు. ఇందుకు రాష్ట్రాల సహకారం ఎంతో అవసరం ఉందని స్పష్టం చేశారు.అందుకే 2025లో తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేసుకున్నాం అని, 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్నది మా లక్ష్యం అని సీఎం తెలిపారు.ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ అని మూడు భాగాలుగా విభజించి అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం అని, హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు లోపలి ప్రాంతాన్ని (క్యూ. యు. ఆర్. ఇ) -- కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీగా అభివృద్ధి చేస్తున్నామని,ఇక్కడ ఐటీ, సేవ రంగాలు, అత్యాధునిక టెక్నాలజీ, ఆవిష్కరణలకు ప్రాధాన్యమిస్తున్నామని వివరించారు. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రీజినల్ రింగ్ రోడ్డు వరకు ఉన్న ప్రాంతాన్ని (పి. యు ఆర్. ఈ) పెరీ అర్బన్ రీజియన్ ఎకానమీగా అభివృద్ధి చేసుకుంటున్నామని, ఈ ప్రాంతంలో తయారీ పరిశ్రమలు, పారిశ్రామిక పార్కులు, లాజిస్టిక్స్ రంగాలను ప్రోత్సహించనున్నట్లుగా తెలిపారు.మిగిలిన గ్రామీణ ప్రాంతాలను (ఆర్. ఏ. ఆర్. ఈ) రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీగా అభివృద్ధి చేస్తున్నామని,ఇక్కడ వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, వ్యవసాయాధారిత పరిశ్రమలు, గ్రామీణ ఉపాధికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లుగా తెలిపారు.ప్రస్తుతం దేశ జీడీపీలో తెలంగాణ 5 శాతం కంట్రిబ్యూట్ చేస్తోంది. దీన్ని 10 శాతానికి చేర్చాలనే లక్ష్యంగా పెట్టుకుని పని చేస్తున్నాం అని సీఎం తెలిపారు.నాలు వందల ఏళ్ల క్రితమే దేశ విదేశాల నుంచి వచ్చే పారిశ్రామికవేత్తలకు చార్మినార్ ల్యాండ్ మార్క్ గా మారిందని,చార్మినార్ తరువాత బిజినెస్ కు ల్యాండ్ మార్క్ హైటెక్ సిటీ అయిందని తెలిపారు.నూతన పారిశ్రామిక విధానంలో మీరంతా భాగస్వాములు కావాలనీ, ఇప్పటి వరకు మనవాళ్లు కేవలం కార్పొరేట్ కంపెనీలకు సర్వీస్ చేసే వైపు మాత్రమే ఉన్నారు.. కానీ మన ప్రాంతానికి చెందిన వాళ్లు పెట్టుబడులు పెట్టి గ్లోబల్ గా ఎదగాలి అని పిలుపునిచ్చారు.

**మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి ...**

ఒకసారి మనం ప్రపంచాన్ని గమనిస్తే...మహిళల భాగస్వామ్యం ఉన్న దేశాలే ఆర్థికంగా బలపడ్డాయి.. అందువలననే తెలంగాణలో మహిళలకు 61 వేల



కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించామని, ఆర్టీసీ బస్సులకు, పెట్రోల్ బంకులకు, సోలార్ ప్లాంట్స్‌కు మహిళలను యజమానులను చేసినట్లు గా తెలిపారు.సమాఖ్య ఛాంబర్ ఆఫ్ కామర్స్ కు నా సూచన ఒక్కటే..యువతతో పాటు మహిళలను ప్రోత్సహించండని,ప్రభుత్వం వైపు నుంచి కావాల్సిన సహకారం అందిస్తాం అని సీఎం తెలిపారు.మంచి విధానాలను తెలంగాణ ప్రభుత్వం కొనసాగిస్తుందని, మీ పెట్టుబడులకు మా భరోసా ఉంటుంది.. తెలంగాణ రైజింగ్ లక్ష్యంగా ముందుకు వెళదాం అని అన్నారు.కార్యక్రమంలో ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కె.రఘు రామరాజు, ఎంపీలు డాక్టర్ కె. లక్ష్మణ్, వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాస రావు, దానం నాగేందర్, మున్నూరు కాపు ఫౌండేషన్ చైర్మ న్ బొమ్మ శ్రీరాం చక్రవర్తి, జస్టిస్ భవానీ ప్రసాద్, కరీంనగర్ గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేష్ పాల్గొన్నారు.

## ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనుల జాప్యంపై కలెక్టర్ ఆగ్రహం

**రిజర్వాయర్ రహదారి, పర్యాటక పనులపై ఆదేశాలు**

**వైరా ఎమ్మెల్యేతో కలిసి పర్యటించిన కలెక్టర్**



**జనోదయ - ఖమ్మం ప్రతినిధి**

ఖమ్మంజిల్లా వైరాలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్న వైనంపై జిల్లాకలెక్టర్ దివాకర, సంబంధిత కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పనుల్లో జాప్యాన్ని నివారించి, నిర్దేశిత గడువులోగా నిర్మాణం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. వైరా మున్సిపాలిటీలో నిర్మాణంలోని అభివృద్ధిపనులు వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టర్, ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, మున్సి పల్ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళతో కలిసి వివిధ పలు అభివృద్ధిపనులను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అనం తరం రింగ్ రోడ్డు సెంటర్ నుంచి వైరా రిజర్వాయర్‌కు వెళ్లే రహదారి పరిశీ లించారు. రిజర్వాయర్ గుట్టపై పర్యాటక అభివృద్ధికి, రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన నేపథ్యంలో పనులకవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని ఆర్.అండ్.బి అధికారులను ఆదేశించారు. పర్యాటకంగా అభివృద్ధికి అను గుణంగా రహదారి పనులు తగిన ప్రణాళికతో చేపట్టాలని సూచించారు. అసంపూర్తిగా నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ కూరగాయల మార్కెట్ భవనాన్ని కూ డా కలెక్టర్ పరిశీలించారు. మార్కెట్ నిర్మాణ పనుల వివరాలడిగి తెలుసుకు న్నారు.అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో మున్సిపాలిటీ పరిధిలో కొనసా గుతున్న అభివృద్ధి పనులపై మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ, కమి షనర్ రామ చంద్రరావు, ఇతర అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. మున్సి పాలిటీ అభివృద్ధే లక్ష్యంగా పాలకవర్గం, అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకవసరమైన మౌలిక సదుపాయాలకల్పనకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధిపనులు నాణ్యతప్రమాణాలతో పూర్తిచేయాలని సూ చించారు. కలెక్టర్ వెంట కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్,, రెవెన్యూ శాఖ అధికారులు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జన్మదినోత్సవాలు, పదవీ విరమణ శుభాకాంక్షల
ప్రకటనల కోసం సంప్రదించండి
8074124190


# సింగరేణిలో కాంగ్రెస్ స్కాములు





## మూడేండ్లలోనే సంస్థలో 10 వేల కోట్ల దోపిడీ

## సింగరేణి ప్రైవేటీకరణకు కాంగ్రెస్, బీజేపీ కుట్రలు

## రెండుపార్టీలు కలిసి అదానీకో, అంబానీకో అమ్ముతయ్

## సింగరేణి స్కామ్‌లపై బీజేపీ నేతలు నోరుమెదపరేం?

## కమీషన్లు ముడుతున్నయా.. కప్పం కడుతున్నరా?

## కార్మిక గర్జన సభలో బీఆర్ఎస్ వర్కింగ్ కేటీఆర్






**జనోదయ : గోదావరిఖని :**

మూడేండ్ల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో కుంభకోణాల కుంభమేళా జరుగుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సింగరేణిలో సైట్ విజిట్ స్కామ్, డీజిల్ స్కామ్, జిలెటిన్ స్టిక్స్ స్కామ్, సోలార్ స్కామ్, జైపూర్ పవర్ స్కామ్.. ఇలా స్కాముల లిస్ట్ చిత్ర గుప్తుడి చిట్టా కూడా సరిపోనంత పెద్దగా ఉన్నదని దుయ్యబట్టారు. ఇప్పటికే ట్రాన్స్‌కోలో 24శాతం వాటాను ప్రైవేట్ అప్పగించేందుకు ద్వారాలు తెరిచిన రేవంత్ సర్కార్, ఇక సింగరేణిని కూడా ఏ అదానీకో, అంబానీకో అప్పజెప్పి ప్రైవేట్‌పరం చేయాలని కుట్రలు చేస్తున్నదని మండిపడ్డారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో బుధవారం రాత్రి సింగరేణి కార్మిక గర్జన సభలో కేటీఆర్ సుదీర్ఘంగా ప్రసంగించారు. ఈ సందర్భంగా స్వరాజ్య సాధన కోసం ఆనాడు సింగరేణి చేసిన పోరాటాలు త్యాగాలను గుర్తుచేస్తూనే.. పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో సింగరేణిలో జరిగిన అభివృద్ధిని కార్మికులకు వివరించారు. ఇదే సమయంలో మూడేండ్లు కాంగ్రెస్ పాలనలో సింగరేణిలో జరుగుతున్న అవినీతి అక్రమాలు, కార్మికులకు జరుగుతున్న అన్యాయం, సింగరేణిని ప్రైవేటీకరణ కుట్రలు, వేల కోట్ల కుంభకోణాలు జరుగుతున్నా సీబీఐ విచారణ చేయించకుండా బీజేపీ కొనసాగిస్తున్న చీకటి ఒప్పందం, తదితర అంశాలపై కార్మిక లోకానికి వివరించి చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.10 వేల కోట్ల కుంభకోణం జరిగిందని రుజువులతో వివరించారు. ఒక్కమాటలో చెప్పాలంటే సింగరేణి ప్రైవేట్ బలిపీఠంపై ఉన్నదని పేర్కొన్నారు. సింగరేణిలో జరుగుతున్న కుంభకోణాలపై బీజేపీ నాయకులు ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఆగడాలు, దోపిడీకి తెరపడి, సింగరేణి తిరిగి సిరుల గనులుగా మారాలంటే కేసీఆర్ ఒక్కరే శ్రీరామ రక్ష అని స్పష్టంచేశారు. కార్పొరేట్ గద్దల నుంచి కోడి తన పిల్లలను రక్షించుకున్నట్టు ప్రైవేట్‌రంగ సంస్థలను కాపాడుకున్నది కేసీఆర్ ఒక్కరేనని, ఆయనతోనే సింగరేణికి భద్రత ఉంటుందని తేల్చిచెప్పారు. అందుకే భవిష్యత్తులో ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్‌ను గెలిపించాలని కార్మిక లోకానికి కేటీఆర్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. సింగరేణి కార్మికులకు బొగ్గు ఉత్పత్తి మాత్రమే కాదు.. ఉద్యమాలు కూడా ఉత్పత్తి చేయగలరని కేటీఆర్ పేర్కొన్నారు. 'చరిత్ర నిండా కార్మికుల కష్టం ఉన్నది. నల్లబొగ్గుకు నెత్తురు అద్ది ప్రాణాలు కోల్పోయిన వాళ్లు ఉన్నరు. చీకటి గుహల్లో రక్త తర్పణం చేసిన వాళ్లు ఉన్నరు. ఎన్నో త్యాగాలు చేసిన కార్మిక కుటుంబాలు నా కంటే మీకే బాగా తెలుసు. చావుతో సావాసం చేసే కార్మికులు ప్రపంచంలో ఎక్కడైనా ఉన్నారా అంటే.. అది మన సింగరేణిలోనే ఉన్నారని గర్వంగా చెప్పుకోవచ్చు.. మీకు బొగ్గు ఉత్పత్తి చేయడమే కాదు.. ఉద్యమాలు ఉత్పత్తి చేయడమూ తెలుసు.. మీ అందరికీ తెలుసు ఉత్పత్తిలో మొనగాళ్లు మీరు.. ఉద్యమాల్లో కూడా మొనగాళ్లు మీరు. కేసీఆర్ పిలుపు ఇస్తే 35 రోజుల పాటు ఒకసారి, 7రోజుల పాటు మరోసారి మొత్తం 42రోజుల పాటు ఒక్క పెళ్ల రాకుండా మీరు తిరుగబడితే.. దక్షిణాది రాష్ట్రాలు మొత్తం చిమ్మ చీకట్లో ఉన్న సంగతి ఎవ్వరూ మర్చిపోలేరు' అని చెప్పారు. నాడు కేసీఆర్ జంగ్ సైరన్ ఊదితే సింగరేణి గడ్డ అండగా ఉన్నదని గుర్తుచేశారు. 'కష్టపడ్డాం.. అందరం సమిష్టిగా పోరాడినం. కేసీఆర్ నాయకత్వంలో ఒకవైపు మీరు.. మరొకవైపు తెలంగాణ సబ్బండ వర్ణం కలిసి కట్టుగా ఢిల్లీ మెడలు వంచి తెలంగాణ సాధించుకున్నం' అని కేటీఆర్ పేర్కొన్నారు. 'ఇక్కడి ప్రజల ఆశీర్వదిస్తే ఒక సామాన్య ఉస్మానియా కాలేజీ విద్యార్థి, దళిత బిడ్డ బాల్క సుమన్‌ను పెద్దపల్లి పార్లమెంట్ నుంచి, ఒక సింగరేణి కార్మికుడు కొప్పుల ఈశ్వర్‌ను రామగుండం నుంచి గెలిపించిన చైతన్యం మీదని చెప్పారు. కేసీఆర్ దిగిపోయి మూడేండ్లు అవుతున్నది. 7,778 మెగావాట్ల నుంచి 24వేల మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి స్థాపితానికి అంటే దాదాపు మూడున్నర రెట్లు కెపాసిటీ పెంచి కాంగ్రెస్ ప్రభుత్వానికి అప్పగిస్తే ఏం జరుగుతున్నది. ఇప్పుడు రాష్ట్రంలో కరెంట్ పోయింది. కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే రాష్ట్రం అంధకారమైతదని కేసీఆర్ ఆనాడే చెప్పారు. మోసపోతే గోస పడతరని ఇదే రామగుండంలో చెప్పారు. ఆ ముసలి నక్క కాంగ్రెస్‌ను నమ్మకండి. ప్రపంచంలో ఎక్కడైనా కార్మికులు బోనస్ కోసం ఉద్యమాలు చేస్తరు.. జీతాల కోసం ఉద్యమాలు చేస్తరు.. హక్కుల కోసం ఉద్య మాలు చేస్తరు.. కానీ తెలంగాణ కోసం తమ రాష్ట్రం కోసం ఉద్యమాలు చేసిన కార్మికులు గోదావరిఖని బిడ్డలని గర్వంగా చెబుతున్నా. మీకున్న రాజకీయ చైతన్యం దేశంలో ఏ కార్మిక వర్గానికి కూడా లేదంటే అతిశయోక్తి కాదు. పదేండ్ల కేసీఆర్ పాలనలో సింగరేణి ఒక వెలుగు వెలిగిందని కేటీఆర్ తెలిపారు. నవరత్న, మహారత్న కంపెనీలకు దీటుగా కార్మికులు కసితో పనిచేసి బొగ్గు ఉత్పత్తి చేస్తే రెప్పపాటు కూడా అంతరాయం లేకుండా అన్ని వర్గాలకు బ్రహ్మాండంగా 24గంటల పాటు కరెంటు ఇచ్చిన దేశంలో ఒకే ఒక నాయకుడు కేసీఆర్ అని చెప్పారు. కానీ ఇవాళ పరిశ్రమలకు పవర్ హాలిడేలు.. రైతుల మోటర్లు కాలిపోవడం.. లో వోల్టేజీ సమస్యలు.. కరెంట్ రాదు.. ఇండ్లల్ల బుగ్గలు వెలుగయి.. ఎండకాలం పడుకుంటేమంటే ఫ్యాన్ కూడా తిరుగని పరిస్థితి దాపురించిందని కాంగ్రెస్ సర్కార్‌పై నిప్పులు చెరిగారు. ఎక్కడికక్కడ పొలాలు ఎండిపోయి, రైతులు వలవలా ఏడుస్తున్న దృశ్యాలు రాష్ట్రవ్యాప్తంగా కనిపిస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. తాము కాంగ్రెస్‌కు ఓటేసి తప్పు చేశామని ఆదిలాబాద్‌లో రైతులు తమ చెప్పులతో తామే కొట్టుకుంటున్నారని పేర్కొన్నారు. ఇలా అనేక మంది బాధపడుతున్న దృశ్యాలు నిత్యం సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయని చెప్పారు. 'కేసీఆర్ హయాంలో యాదాద్రి పవర్‌స్టేషన్ కట్టినం.. మిర్యాలగూడ వద్ద దామెరచెర్లలో కట్టినం. 4వేల మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేసే బొగ్గు ఆధారిత విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాన్ని కట్టినం. ఇవాళ అన్ని కేంద్రాలను పక్కన పెట్టారు. 4వేల మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి కేంద్రంలో 400 మెగావాట్లు కూడా ఉత్పత్తి కావడం లేదు. ఎందుకని జగదీశ్‌రెడ్డి వెళ్లి అడిగితే సింగరేణి బొగ్గు ఇవ్వడం లేదని నెపం నెడుతున్నారు' అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. బొగ్గు ఎందుకు ఇవ్వడం లేదని కొప్పుల ఈశ్వర్ నాయకత్వంలో సింగరేణి హెడ్ క్వార్టర్స్ వెళ్లి అడిగితే ముఖ్యమంత్రే తమకే రూ.60 వేల కోట్లు బాకీ పడ్డారని, అవి ఇవ్వకుండా నెపం నెడుతున్నారని లోలోపల కుమిలిపోతున్నారని చెప్పారు. గోదావరిఖనిలో నిలబడితే చాలా గర్వంగా అనిపిస్తున్నది. గోదావరిఖని బిడ్డ.. తమ్ముడు శ్రీకాంత్ ఓదెల ప్యారడైజ్ అనే సినిమా తీసిండు. ఇందులో కేసీఆర్ పాత్ర ఉన్నది అంటే ఆసక్తిగా చూడటానికి పోయిన. ఈ గడ్డ గొప్పతనం, ఇక్కడి నీళ్ల గొప్పదనం ఏందంటే.. అణచివేయబడ్డ జాతి ఎట్ల తిరుగబడతదో, ఆ జాతి నాయకుడు కదిలి వచ్చిననాడు ఎట్ల నిలబడతదో చూపించిన అద్భుతమైన సినిమా అది. అట్లాంటి గొప్పతం గోదావరిఖని నేలలో ఉన్నది. సింగరేణి బొగ్గు లేకపోతే.. కార్మికులు ఉత్ప త్తి చేస్తున్న బొగ్గంతా ఎక్కడపోతున్నది.. ఎక్కడ మాయమైందని కేటీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ బొగ్గును బుక్కిన బకాసురుడు ఎవ రు? ఈ బొగ్గును మాయం చేసిన మాయల ఫకీరు ఎవరు? అనేది ఆలోచించాల్సిన అవసరం ఉన్నది. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు బొగ్గు కొరత లేదు.. కరెంట్ కొరత లేదు. నీళ్లకు కొరత లేదు. పదేండ్లు బ్రహ్మాండంగా నడిచిన సింగరేణి ఇప్పుందుకు ఈ పరిస్థితిలో ఉన్నదో ఆలోచించాలి' అని కోరారు. సింగరేణి కోల్‌ను గోల్‌మాల్ చేస్తున్న దొంగ ఎవరు? కోల్‌మాల్ గోల్‌మాల్ దొంగ ఎవరు? అని కేటీఆర్ ప్రశ్నించగా సభికుల నుంచి 'రేవంత్‌రెడ్డి.. రేవంత్‌రెడ్డి' అంటూ నినాదాలు వినిపించాయి. దివాలాకోరు కాంగ్రెస్ పాలనలో సింగరేణి దివాలా తీసే పరిస్థితి వచ్చిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. 'బీఆర్ఎస్ అధికారం కోల్పోయేనాటికి 2023 డిసెంబర్‌లో సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి 70 మిలియన్ టన్నులు.. ఇదొక సూపర్ రికార్డు. 2025-26లో కేవలం 58 మిలియన్ మెట్రిక్ టన్నులు మాత్రమే. రాను రాను పెరుగాలా.. తగ్గాలా? 70 మిలియన్ టన్నుల నుంచి 58 మిలియన్ టన్నులకు పడిపోయింది. సింగరేణిలో ఉత్పత్తి పడిపోవడానికి కారణం కార్మికుడు కాదు.. కాంగ్రెసోళ్లే కారణం. ఓపెన్ కాస్టుల్లో ఓబీ టెండర్లలో ఆలస్యం కావడం వల్లనే ఉత్పత్తి తగ్గింది. టెండర్లు ఆలస్యం అవుతున్నయి. ఎందుకంటే వీళ్ల వాటాల లెక్కలు తేలడం లేదు.. ఈ నిబంధన భారత దేశంలోని కోల్ ఇండియాలోగానీ, నవరత్న, మహారత్న సంస్థల్లోగానీ ఎక్కడా లేదు. కానీ ఈ సైట్ విజిటేషన్ సర్టిఫికెట్ అనే కుంభకోణానికి ప్రధాన సూత్రధారి ఎవరో కాదు.. సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన బామ్మర్ది సృజన్‌రెడ్డి. వాళ్లిద్దరు కలిసి కాంట్రాక్టర్లను బెదిరించి, వేల కోట్ల కుంభకోణాలకు పాల్పడటం వల్లనే ఓపెన్ కాస్ట్ టెండర్లు ఆలస్యం అయ్యాయి' అని స్పష్టంచేశారు. 'సింగరేణిలో నైనీ కుంభకోణాన్ని తాను అడ్డుకోవడం వల్ల ప్రభుత్వానికి రూ.30 కోట్లు మిగిలాయని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఒక చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.. మరీ నైనీ కుంభకోణం చేసి ఇంత సొమ్ము మింగుతామని అనుకున్నదెవరు?' అని కేటీఆర్ ప్రశ్నించగా రేవంత్‌రెడ్డి.. రేవంత్ రెడ్డి అని సభికుల నుంచి నినాదాలు వినిపించాయి. రేవంత్‌రెడ్డి ఏ స్కామ్ చేసినా ప్రధాని మోదీ మౌనంగా ఉంటున్నారని కేటీఆర్ విమర్శించారు. ఇక్కడ ఏఐటీయూసీ గుర్తిం పు సంఘం ఉన్నా వాళ్లకు అడిగే ధైర్యం లేదని పేర్కొన్నారు. 'అందుకే కాంగ్రెస్ అరాచకం, రౌడీయిజం, వేధింపులు భరించ లేకనే కోల్‌బెల్ట్ తుపాకులతోనే తిరుగబడ్డది. సింగరేణి సమాఖ్య పేరిట ఆ రోజు శతుఘ్నులై గర్జించింది ఇదే సింగరేణి గడ్డ. మళ్లీ కాంగ్రెస్ దోపిడీని తరిమికొట్టడానికి మీకున్న ఒకే ఒక అస్త్రం, మీకున్న ఒకే ఒక నాయకత్వం కేసీఆర్ మాత్రమేనని మీకు విజ్ఞప్తి చేస్తున్నా.. కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి ఏడాది లాభాల్లో వాటా పెంచుకుంటా పోయినం. కేసీఆర్ రాక ముందు లాభాల్లో వాటా 16శాతం ఉండే. కానీ కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 32 శాతం చెల్లించాం. మళ్లీ కాంగ్రెస్ వచ్చాక ఏం జరిగింది. 33 శాతం అని ఇచ్చింది 16 శా తం రెండో సంవత్సరం 34 శాతమని 12శా తమే ఇచ్చారు. ఇప్పుడు గులాబీ దండు గర్జిస్తే నే దెబ్బకు దయ్యం దిగివచ్చి దసరాకు లాభాల వాటా ఇస్తున్నరు. ఇది కూడా సరిగ్గా ఇవ్వకుంటే సింగరేణి బెల్ట్‌లో ఉండే ప్రతి ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తం .ప్రతి మంత్రి ఇంటిని ముట్టడిస్తం. మీకు అన్యాయం జరిగితే వదిలి పెట్టమని చెబుతున్నా' అని చెప్పారు. సభలో మాజీ స్పీకర్ మధుసూదనా చారి, టీబీజీకేఎస్ గౌరవాధ్యక్షుడు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, ఎమ్మెల్యేలు కోవా లక్ష్మి, గంగుల కమలాకర్, పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, పుట్ట మధూకర్, దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, గండ్ర వెంకటరమణారెడ్డి, పోలీస్ హౌసింగ్ బోర్డ్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్, కటారి రేవతి, రామగుండం మాజీ మేయర్ కొంకటి లక్ష్మీనారాయణ, పెద్దపెల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ మమతారెడ్డి, బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాళ్ల హరీశ్ రెడ్డి, కౌశిక్ హరి ,మూల విజయ రెడ్డి, నాయకులు నడిపెల్లి మురళీధర్ రావు, పీటీ స్వామి, టీబీజీకేఎస్ నాయకులు మాదాసు రామమూర్తి, వడ్డేపల్లి శంకర్ నూనె కొమురయ్య, చెల్పూరి సతీశ్ తదితరులు పాల్గొన్నారు.



# నాలుగో స్థానానికి శ్రేయస్ అయ్యర్



### ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్ : కెరీర్‌లోనే బెస్ట్

ఢిల్లీ : భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఐసీసీ టీ20 అంతర్జాతీయ బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో కెరీర్ బెస్ట్ ర్యాంకును అందుకున్నాడు. వెస్టిండీస్‌తో జరుగుతున్న ఐదు టీ20ల సిరీస్‌లో అదరగొడుతున్న సర్పంచ్ సాబ్.. తాజా ర్యాంకింగ్స్‌లో మూడు స్థానాలు ఎగబాకి 798 పాయింట్లతో నాలుగో స్థానానికి చేరుకున్నాడు. లఖ్‌నవూ వేదికగా జరిగిన తొలి టీ20లో శ్రేయస్ తన కెరీర్‌లోనే తొలి టీ20 అంతర్జాతీయ సెంచరీ సాధించిన విషయం తెలిసిందే. తాజా టీ20 బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో భారత ఆటగాళ్ల ఆధిపత్యం కొనసాగుతోంది. ఇషాన్ కిషన్(904 పాయింట్లు) అగ్రస్థానంలో ఉండగా.. అభిషేక్ శర్మ(891 పాయింట్లు) రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. శ్రేయస్‌తో సహా టాప్-4లో ముగ్గురు భారత బ్యాటర్లు చోటు దక్కించుకోవడం విశేషం. పాకిస్థాన్ ఆటగాడు సాహిబ్జాదా ఫర్హాన్(883 పాయింట్లు) మూడో స్థానంలో ఉన్నాడు. మరోవైపు స్టార్ బ్యాటర్ తిలక్ వర్మ కూడా తాజాగా ర్యాంకింగ్స్‌లో భారీ పురోగతి సాధించాడు. 731 పాయింట్లతో తొమ్మిదో స్థానం లో కొనసాగుతున్నాడు. వెస్టిండీస్ బ్యాటర్ షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ 13 స్థానాలు మెరుగుపరుచుకుని సంయుక్తంగా 24వ స్థానంలో నిలిచాడు. భారత వికెట్ కీపర్ సంజు శాంసన్ నాలుగు స్థానాలు ఎగబాకి సంయుక్తంగా 27వ ర్యాంకును అందుకున్నాడు.

**బౌలింగ్ విభాగంలో..**

భారత్‌పై చెలరేగిన వెస్టిండీస్ ప్లేయర్ రోస్టన్ చేజ్ టీ20 బౌలర్ల ర్యాంకింగ్స్‌లో ఏకంగా 24 స్థానాలు మెరుగుపరుచుకుని 23వ స్థానానికి చేరుకున్నాడు. ఆల్‌రౌండర్ల జాబితాలోనూ రెండు స్థానాలు ఎగబాకి మూడో ర్యాంకును అందుకున్నాడు. వెస్టిండీస్ సిరీస్‌కు దూరంగా ఉన్న బుమ్రా(637 పాయింట్లు) 11వ




స్థానానికి పడిపోయాడు. విండీస్‌పై అంతగా ప్రభావం చూపలేకపోతున్న అక్షర్ పటేల్(649 పాయింట్లు) తొమ్మిదో స్థానానికి పడిపోయాడు. టాప్ బౌలర్‌గా కొనసాగిన వరుణ్ చక్రవర్తి గాయం కారణంగా జట్టుకు దూరమైన సంగతి తెలిసిందే. ఇప్పుడు 632 పాయింట్లతో ఏకంగా 15వ స్థానానికి పడిపోయాడు.

**టెస్టు ర్యాంకింగ్స్‌లో..**

టెస్టు ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో భారత సీనియర్ ఆటగాడు రవీంద్ర జడేజా తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నాడు. 422 పాయింట్లతో అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టెస్టులో ఆస్ట్రేలియా 214 పరుగుల తేడాతో ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఆస్ట్రేలియా బ్యాటర్ మాథ్యూ రెన్‌షా తొలి ఇన్నింగ్స్‌లో 190 పరుగులు.. రెండో ఇన్నింగ్స్‌లో 82 పరుగులతో కీలక పాత్ర పోషించాడు. ఈ ప్రదర్శనతో అతడు టెస్టు బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో టాప్-100 వెలుపలి నుంచి సంయుక్తంగా 49వ స్థానానికి చేరుకున్నాడు.

# తిరుమలగిరి మార్కెట్‌లో ధాన్యాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే మందుల సామెల్



**జనోదయ : తిరుమలగిరి:**

సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం నాడు ధాన్యాన్ని పరిశీలించిన తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేలు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మందుల సామేల్ మాట్లాడుతూ మార్కెట్లో రైతులకు మద్దతు ధర కంటే అధికంగా ధరతో ధాన్యాన్ని కొను గోలు చేయడం శుభ పరిణామమని రైతులందరూ వ్యవసాయమార్కెట్కు ధాన్యా న్ని తీసుకువచ్చి మంచి ధర పొందాలనీ ఎమ్మెల్యే సూచిం చారు. అలాగే మార్కెట్లో అదనపు ధాన్యం షెడ్ల నిర్మాణం కోసం సంబంధిత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో తక్షణమే మాట్లాడిమంజూరుచేయించారని మార్కెట్లో కావలసిన సౌకర్యాలను కల్పిస్తానని స్థానిక శాసన సభ్యులు మందుల సామేలు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యేల్సోజు చామంతి నరేష్, పలువురు మండల కాంగ్రెస్ పార్టీఅధ్య క్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులు,వ్యాపారస్తులు,మార్కెట్ సెక్రటరీ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# తిరుమలగిరి చౌరస్తా ఫ్లై ఓవర్‌పై భిన్నాభిప్రాయాలు

**వ్యాపారాలు దెబ్బతింటాయంటున్న యజమానులు**

**బైపాస్ లేదా జంక్షన్ సిగ్నల్స్ కోసం డిమాండ్**

**ప్రాణాలతో చెలగాటం వద్దు.. ఫ్లైఓవర్ నిర్మాణం అత్యవసర మంటున్న స్థానికులు, వాహన దారులు**

**జనోదయ : తిరుమలగిరి:**

సూర్యాపేట జి ల్లా తుంగతుర్తి నియోజకవర్గం తిరుమల గిరి మండలకేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో ప్రతిపాదించిన ఫ్లైఓవర్ నిర్మాణం స్థానికంగాతీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రాజెక్టుపై వ్యాపారులు,స్థానిక ప్ర జల నుం డి భిన్నమైన డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి.చౌరస్తాలో ఫ్లైఓవర్ నిర్మించవద్దంటూ కమర్షి యల్ బిల్డింగ్ యజమానులు, వ్యాపారులు, పలువురు రాజకీ య నాయకులు ఆందోళనవ్యక్తం చేశారు. ఫ్లైఓవర్ నిర్మాణం వల్ల ఇక్కడివ్యాపారాలు పూర్తిగాదెబ్బ తినే ప్రమాదం ఉందని వారు ఆందోళన చెందుతున్నారు. చౌరస్తా లో ప్రమాదాలనివారణకు కేవలం జంక్షన్ వ్యవస్థతో కూడిన ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని, లే దంటే పట్టణానికి వెలుపల నుం డి బైపాస్ రహదారిని నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొమ్మినేని సతీష్, కందుకూరి ప్రవీణ్,సాయిలు భవనయజమానులు, వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

**ఫ్లైఓవర్ లేకుంటే ప్రాణాలకే ముప్పు**

స్థానికులు,వాహనదారులుమరో వైపు వ్యాపారుల డిమాండ్‌ను స్థానిక ప్రజలు, రవాణా వాహన యజమానులు, పాదాచారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వలిగొండ నుండి తొర్రూరు వెళ్లే జాతీ య రహదారి తిరుమలగిరి



మం డల కేంద్రం గుండా వెళ్తుండటం, అలాగే నాలుగు జిల్లాల సరిహ ద్దు కావడంతో ఈ చౌరస్తాలో భారీ వాహనాల రద్దీ విపరీతంగా ఉంటోందని వారు గుర్తుచేస్తున్నారు. నిత్యం పక్క గ్రామాల నుండి వేలాది మంది ప్రజలు తమ అవ సరాల కోసం ఇక్కడికి వస్తుంటా రని,ప్రస్తుతం రోడ్డు దాటాలంటేనే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవా ల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చే శారు.ఫ్లైఓవర్ నిర్మించకుండా కేవ లం బైపాస్ రోడ్డు వేస్తే తిరుమల గిరి మండలం కేంద్రం మున్సిపా లిటీ అభివృద్ధి పరంగా పూర్తిగా నష్టపోతుందని స్థానికులు హెచ్చ రిస్తు న్నారు. ఫ్లైఓవర్ నిర్మిస్తేనే ప్ర మాదాలు తగ్గి వాహనదారులకు, కాలి నడకన వెళ్లేవారికి శాశ్వత ప్రాణ రక్షణ లభిస్తుందని వారు స్పష్టం చేశారు.కేవలం కొంత మంది వ్యాపారుల స్వార్థం కోసం ఫ్లై ఓవర్ ఆపితే, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడినట్లే అవుతుంద ని వారు హెచ్చరించారు. అందరికీ మేలు జరిగేలా ఇక్కడ ఫ్లైఓవర్ నిర్మించడమే ఉత్తమమని స్థానిక ప్రజలు, పలు వాహనదారులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.



# పాలకుడిని కాదు.. ప్రజా సేవకుడిని

**ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం**

**ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

**దీన్‌దయాళ్ నగర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన**

**జనోదయ : హనుమకొండ, అక్టోబర్ 14:**

నేనెప్పుడూ పాలకుడిని కాదు.. ప్రజా సేవకుడినే. ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి ప్రజల్లోనే ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నా. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు క్యాంపు కార్యాలయం తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే  నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 31వ ,50 వ డివిజన్ పరిధిలోని దీన్‌దయాళ్ నగర్‌లో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్యే  శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కాలనీ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.శాయంపేట డివిజన్‌లో గత మూడేళ్లుగా అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. పూర్తిస్థాయి గ్రామీణ వాతావరణం కలిగిన శాయంపేట డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. గతంలో శాయంపేట పరిధిలోని కొన్ని కాలనీలకు ఎమ్మెల్యేలు సైతం పర్యటించని పరిస్థితి ఉండేదని, తాను గెలిచిన నాటి నుంచి నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని అన్నారు.ఇప్పటికే పలు కాలనీల్లో అంతర్గత రోడ్లు , డ్రైనేజీ వ్యవస్థల అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేశామని వివరించారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందేలా కృషి చేశామని తెలిపారు. ఇంకా ఇళ్లు మంజూరు కావాల్సిన అర్హులైన లబ్ధిదారులు ఉన్నారని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి రానున్న రోజుల్లో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధి చేకూరేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా కాలనీ ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి పలు స్థానిక సమస్యలను తీసుకువచ్చారు. వాటిలో కొన్నింటిని అక్కడికక్కడే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించేలా చర్యలు తీసుకున్నారు. మిగిలిన సమస్యలను కూడా ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డివిజన్ ఇంచార్జ్ మార్క విజయ్,మాజీ కార్పొరేటర్లు మామిండ్ల రాజు,నెక్కొండ కవిత కిషన్, డివిజన్ అధ్యక్షులు సత్తు రమేష్,మాజీ అధ్యక్షులు సురేందర్ ,స్థానిక కాలనీ నాయకులు అశోక్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

Publisher, Editor and Owned by Manasani Krishna Reddy, H No 4-81/1, Ramagundam, Elkalpalli, Karimnagar, Telangana - 505208.
RNI No - APTEL/2022/81596 .. Cell No - 8074124190 ...Printed At ESHAGNA SERVICE INDIA PRIVATE LIMITED,H NO 6-1-303, WARD - 29 ASHOKNAGAR, KARIMNAGAR, TELANGANA -505001. Editor : MANASANI KRISHNA REDDY

# హైదరాబాదుడులో భారత్ బోల్తా

**ఉప్పల్ టీ20లో వెస్టిండీస్‌దే విజయం**
**శాంసన్, తిలక్, నితీశ్ మెరుపులు వృథా**
**శతక్కొట్టిన కెప్టెన్ హోప్**
**5 వికెట్లతో కీమో పాల్ దెబ్బ**

**హైదరాబాద్ :** కరీబియన్ పవర్ హిట్టర్లు మరోసారి తమ ఖలేజా చూపెట్టారు. సూపర్ ఫామ్‌లో ఉన్న కెప్టెన్ షై హోప్ (50 బంతుల్లో 4 ఫోర్లు, 9 సిక్సర్లతో 102 నాటౌట్) శతక విజృంభణకు తోడు ఫ్లాట్ వికెట్‌పై కీమో పాల్ (5/41) ఐదు వికెట్లతో పంజా విసరడంతో బుధవారం జరిగిన నాలుగో టీ20లో విండీస్ 24 పరుగుల తేడాతో భారత్‌ను ఓడించింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-2తో సమం చేసింది. ఈ హై స్కోరింగ్ పోరులో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన విండీస్ 20 ఓవర్లలో 247/3 స్కోరు చేసింది. షెర్ఫేన్ రూథర్‌ఫర్డ్ (26 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 49 నాటౌట్) కూడా మెరుపులు మెరిపించాడు. భారత బౌలర్లలో మయాంక్ యాదవ్ ( 0/52), అర్ష్‌దీప్ సింగ్ (1/52) ధారాళంగా పరుగులు సమర్పించుకున్నారు. అనంతరం భారీ ఛేదనలో టీమిండియా 19.3 ఓవర్లలో 223 రన్స్‌కే ఆలౌటైంది.సంజూ శాంసన్ (23 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్సర్లతో 56), తిలక్ వర్మ (25 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లతో 43), నితీశ్ రెడ్డి (20 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్సర్లతో 41) పోరాడినా ఓటమి తప్పలేదు. పాల్‌తో పాటు గుడకేశ్ మోతీ (2/13) రెండు వికెట్లు తీశాడు. హోప్ ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు. సిరీస్ విన్నర్‌ను తేల్చే చివరి, ఐదో టీ20 శనివారం బెంగళూరులో జరగనుంది. కొండంత లక్ష్య ఛేదనలో భారత్‌కు ఓపెనర్ సంజూ శాంసన్ మెరుపు ఆరంభం అందించాడు. తొలి నాలుగు ఓవర్లలో 22 బంతులను అతనే ఎదుర్కొని మెరుపు అర్ధ శతకంతో అలరించాడు. ఇన్నింగ్స్ తొలి బాల్‌నే బౌండరీకి చేర్చిన శాంసన్.. షమార్ జోసెఫ్ వేసిన రెండో ఓవర్లో వరుసగా 4,6,6 బాదాడు. ఆపై ఛేజ్ బౌలింగ్‌లో 4,6, 6,4తో ఏకంగా 25 పరుగులు రాబట్టడంతో మూడు ఓవర్లకే స్కోరు 50 దాటింది. షెఫర్డ్ వేసిన తర్వాతి ఓవర్లో వరుసగా రెండు ఫోర్లు కొట్టి అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. కానీ ఐదో ఓవర్లో బౌలింగ్‌కు దిగిన కీమో పాల్ తొలి బంతికి శాంసన్, నాలుగో బంతికి ఇషాన్ (6)ను ఔట్ చేసి భారత్‌ను దెబ్బకొట్టాడు. సంజూ క్రీజులో ఉన్నంతవరకు మూడు బాల్స్ మాత్రమే ఎదుర్కొన్న అభిషేక్ (29) ఆ తర్వాత తనదైన శైలిలో ఆడలేపోయాడు. నాలుగో నంబర్‌లో వచ్చిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (16) రెండు ఫోర్లు కొట్టి స్ప్రింగర్ వేసిన తొమ్మిదో ఓవర్లో ఆండ్రూకు క్యాచ్ ఇచ్చి నిరాశపరిచాడు. అదే ఓవర్లో అభి తన తొలి సిక్స్ కొట్టగా.. అభిమానుల కేరింతల నడుమ క్రీజులోకి వచ్చిన లోకల్ బాయ్ తిలక్ వర్మ.. షెఫర్డ్ బౌలింగ్‌లో 4,6 బాదడంతో 11 ఓవర్లకు 126/3తో భారత్ బలమైన స్థితిలో నిలిచింది. కానీ, స్పిన్నర్ మోతీ వేసిన ఔట్ సైడ్ ఆఫ్ స్టంప్ బంతికి భారీ షాట్ ఆడిన అభిషేక్ లాంగాఫ్‌లో స్ప్రింగర్‌కు క్యాచ్ ఇవ్వగా.. తర్వాతి బాల్‌కే నమన్ ధీర్ (0) స్టంపౌటవడంతో భారత్ 135/5తో డీలా పడింది. చివరి 48 బంతుల్లో 116 పరుగులు అవసరం అయిన దశలో భారత్‌ను ముందుకుతీసుకెళ్లే బాధ్యత ఇద్దరు తెలుగు ఆటగ్గాళ్లైన తిలక్, నితీశ్ రెడ్డిపై పడింది. అభిమానుల అంచనాలకు తగ్గట్టే కీలక సమయంలో ఈ ఇద్దరూ భారీ షాట్లతో విండీస్ బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. పాల్ బౌలింగ్‌లో స్వీప్ షాట్‌తో తిలక్ సిక్స్ కొడితే.. స్ప్రింగర్ ఓవర్లో నితీశ్ లాంగాఫ్ మీదుగా బంతిని స్టాండ్స్‌కు చేర్చాడు. అదే జోరులో షమార్ వేసిన 16వ ఓవర్లో నితీశ్ ఓ ఫోర్, వరుసగా రెండు సిక్సర్లతో స్టేడియాన్ని హోరెత్తించాడు. ఆపై, షెఫర్డ్ వేసిన లో ఫుల్ టాస్‌ను తిలక్ అద్భుతమైన షాట్‌తో లాంగాన్ మీదుగా సిక్స్‌గా మార్చి ఔరా అనిపించాడు. విజయ సమీకరణం 23 బంతుల్లో 53 పరుగులగా మారగా.. తెలుగు క్రికెటర్ల జోరు చూస్తుంటే భారత్ మ్యాచ్ నెగ్గేలా కనిపించింది. కానీ, అదే ఓవర్ చివరి బంతికి మరో భారీ షాట్‌కు యత్నించి తిలక్.. క్యాచ్ ఔట్ అవడం భారత్‌ను దెబ్బతీసింది. ఆరో వికెట్‌కు 70 పరుగుల భాగస్వామ్యం ముగిసిన తర్వాత చివర్లో విండీస్ బౌలర్లు అద్భుతంగా పుంజుకున్నారు. 18వ ఓవర్లో స్ప్రింగర్ ఐదే రన్స్ ఇవ్వగా.. తర్వాతి ఓవర్లో నితీశ్, ప్రిన్స్ (0), అక్షర్ (3)ను పెవిలియన్ చేర్చిన కీమో పాల్‌ను విండీస్ విజయం ఖాయం చేశాడు. షమార్ వేసిన ఆఖరి ఓవర్ మూడో బంతి తర్వాతి అర్ష్‌దీప్ (5) భుజం నొప్పితో రిటైర్డ్ హర్ట్ అవ్వడంతో భారత పోరాటం ముగిసింది. కెరీర్ బెస్ట్ ఫామ్‌లో ఉన్న విండీస్ కెప్టెన్ షై హోప్ భారత పర్యటనలో నాలుగోసారి శతక మోత మోగించడంతో ఈ పోరులో కరీబియన్ టీమ్ భారీ స్కోరు సాధించింది. ఆట ఆరంభం నుంచే విండీస్ బ్యాటర్లు భారత్‌పై ఎదురుదాడికి దిగారు. ఆతిథ్య బౌలర్లు కట్టుతప్పడంతో పాటు ఫీల్డింగ్ తప్పిదాలు కూడా కరీబి యన్లకు కలిసొచ్చాయి. అర్ష్‌దీప్ వేసిన రెండో ఓవర్లో ఓపెనర్ జెవెల్ ఆండ్రూ (21) 6,4,4తో 17 రన్స్ రాబట్టాడు. మయాంక్ యాదవ్ బౌలింగ్‌లో 6,4తో టచ్‌లోకి వచ్చిన హోప్.. నాలుగో ఓవర్లో ప్రిన్స్ యాదవ్‌కు 6,4తో స్వాగతం పలికాడు. దాంతో కెప్టెన్ అయ్యర్ ఐదో ఓవర్లోనే స్పిన్నర్ అక్షర్ పటేల్‌ను బరిలోకి దింపాడు. తన రెండో బంతికే ఆండ్రూను ఎల్బీ చేసిన అక్షర్ నాయకుడి నమ్మకాన్ని నిలబెట్టాడు. కానీ, హోప్‌కు తోడైన షిమ్రన్ హెట్‌మయర్ (33) కూడా భారీ షాట్లతో విరుచుకుపడటంతో పవర్‌ప్లేను 79/1తో ముగించిన విండీస్ స్కోరు 7.4 ఓవర్లలోనే వంద దాటింది. తొమ్మిదో ఓవర్లో హెట్‌మయర్‌ను ఔట్ చేసి ప్రిన్స్ యాదవ్ బ్రేక్ ఇచ్చినా.. రోవ్‌మన్ పావెల్ (24) తోడుగా ముందుకెళ్లిన హోప్ 28 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. అక్షర్ వేసిన 12వ ఓవర్లో పావెల్, హోప్ చెరో ఫోర్, సిక్స్ బాదడంతో 22 రన్స్ వచ్చాయి. తర్వాతి ఓవర్లోనే కీపర్ క్యాచ్‌తో పావెల్‌ను అర్ష్‌దీప్ వెనక్కు పంపినా హోప్ మాత్రం తన ధాటిని కొనసాగించాడు. స్లాగ్ ఓవర్లలో అతనికి తోడైన రూథర్‌ఫర్డ్ మరోసారి మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. మయాంక్ వేసిన 17వ ఓవర్లో 6,4,6 కొట్టి స్కోరు 200 దాటించాడు. ఇంకోఎండ్‌లో జోరు కొనసాగించిన హోప్..నితీశ్ రెడ్డి వేసిన చివరి ఓవర్లో ఆఖరి రెండు బంతులకు సిక్సర్లు కొట్టి ఈ సిరీస్‌లో రెడో శతకం పూర్తి చేసుకోవడంతో పాటు భారత్ ముందు భారీ లక్ష్యాన్ని ఉంచాడు. హోప్, రూథర్‌ఫర్డ్ ద్వయం నాలుగో వికెట్‌కు అజేయంగా 91 పరుగులు జోడించింది.







## మెగా రక్తదాన శిబిరం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన చెన్నూరు సీఐ

**జనోదయ :** చెన్నూర్ ఆర్సీ

రక్తదానం అనేది ప్రాణాలను కాపాడే అత్యంత పవిత్రమైన మహాదానమని, ప్రతి ఒక్కరూ రక్తదాన మహాయజ్ఞంలో భాగస్వాములు కావాలని చెన్నూరు పట్టణ సీఐ బాన్సీలాల్ పిలుపునిచ్చారు. లయన్స్ క్లబ్ ఆఫ్ చెన్నూర్ మరియు స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న మెగా రక్తదాన శిబిరానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను చెన్నూరు పట్టణ సీఐ బాన్సీలాల్ చేతుల మీదుగా బుధవారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐ బాన్సీలాల్ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ఉన్న బాధితులకు మనం చేసే ఒక్క రక్తదానం పునర్జన్మను ప్రసాదిస్తుందని పేర్కొన్నారు. రాబోయే మెగా రక్తదాన శిబిరంలో చెన్నూరు పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల యువకులు, ప్రజలు




పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేసి ప్రాణ దాతలుగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు నిమ్మల సాగర్, జోన్ చైర్‌పర్సన్ జాడి తిరుపతి, బ్లడ్ బ్యాంక్ చైర్‌పర్సన్ బొల్లంపల్లి నాగరాజు గౌడ్, బ్లడ్ బ్యాంక్ కో చైర్‌పర్సన్ పప్పురెడ్డి దీక్షిత్, కోశాధికారి సోదం శ్రీనివాస్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు జక్కుల సత్యనారాయణ, నగునూరి మహేష్ గౌడ్, నస్పూరి కార్తీక్, రిత్విక్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

## రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



**జనోదయ : రాజన్న సిరిసిల్ల**

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్పష్టం చేశారు. ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్లపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, వివిధ శాఖల అధికారులు, పీఏసీఎస్ సెక్రటరీలు, ఐకేపీ, మెప్మా కేంద్రాల నిర్వాహకులు, వ్యవసాయ శాఖ అధికారులు, ట్యాబ్ ఎంట్రీ ఆపరేటర్లతో బుధవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ గ్రేడ్ ఏ రకం ధాన్యం క్వింటాలుకు రూ. 2,461, సాధారణ రకానికి రూ. 2, 441గా మద్దతు ధర ఉందని వెల్లడించారు. బీపీటీ 5204, ఆర్ ఎన్ ఆర్ 15408, హెచ్ ఎం టీ సోన, జై శ్రీరామ్, కే ఎన్ ఎం 1638, కే ఎన్ ఎం 7715, డబ్ల్యు జీ ఎల్ 44 సన్నవడ్ల రకాలకు ప్రభుత్వం క్వింటాలుకు అదనంగా రూ. 500 ఇస్తుందని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల్లో రేపటి నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని సూచించారు. అన్ని కేంద్రాల్లో తప్పనిసరిగా టెంట్లు, తాగు నీరు, విద్యుత్ వసతి కల్పించాలని, టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, తూకం వేసే యంత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. రైతులు తమ ధాన్యాన్ని తాలు, తప్ప లేకుండా, తేమ శాతం 17 ఉండేలా చూసుకుని కేంద్రాలకు తరలించాలని సూచించారు. నిబంధనల మేరకు రైతులు తమ ధాన్యాన్ని శుభ్రంగా తీసుకువచ్చి, మద్దతు ధర పొందాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం తూకంలో పారదర్శకంగా ఉండాలని, నిర్దేశించిన విధంగా కొనుగోళ్లు చేయాలని సూచించారు. రైతులకు టోకెన్లు ఇవ్వాలని, దాని ప్రకారం కొనుగోళ్లు చేయాలని సూచించారు. ఈ సారి ధాన్యం తరలించే అన్ని వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ సిస్టమ్ ఉంటుందని తెలిపారు. దీంతో వాహనాలు ఎక్కడ ఉన్నా తెలుసుకోవచ్చని స్పష్టం చేశారు. యాసంగి సీజన్లో ధాన్యం కొనుగోలు సజావుగా పూర్తి చేసేందుకు సహకరించిన ఆయా శాఖల అధికారులు సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఈ సీజన్లో రైతులకు ఉత్తమ సేవలు అందించి.. కొనుగోళ్ల ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేయాలని పిలుపు నిచ్చారు. ఈసమావేశంలో డీఆర్ డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బుచ్చిబాబు, పౌర సరఫరాల శాఖ మేనేజర్ గోపాల్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, సహకార అధికారి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి వివేక్ వెంకటస్వామి సమక్షంలో

# ఆప్ నాయకుడు జలీల్ జల్లు కాంగ్రెస్‌లో చేరిక



**జనోదయ : చెన్నూర్ ఆర్ సి**

మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ లోకి వలసల పరంపర కొనసాగుతోంది. చెన్నూరు పట్టణానికి చెందిన ప్రముఖ ఆమ్ ఆద్మీ పార్టీ (ఏ ఏ పి) నాయకుడు జలీల్ జల్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. తెలంగాణ రాష్ట్ర గనులు, కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి చెన్నూరు ఎమ్మెల్యే డా. వివేక్ వెంకటస్వామి హైదరాబాద్ నివాసంలో ఈ చేరికల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జలీల్ జల్లుకు మంత్రి వివేక్ వెంకటస్వామి గమ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి, పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మంత్రి వివేక్ వెంకటస్వామి చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు, నియోజకవర్గ అభివృద్ధికి ఆకర్షితులై తాము కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు జలీల్ జల్లు ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, నియోజకవర్గ ప్రజా సమస్యల పరిష్కారానికి ఒక కార్యకర్తలా శ్రమిస్తానని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బషీర్ భాయ్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకులు యువకులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో రాజకీయాలకు తావులేదు

## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**జనోదయ : హైదరాబాద్, అక్టోబర్ 14:**

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆ కుటుంబం ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గాలకే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు పరిమితమైతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పార్టీల తేడా లేకుండా రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గాన్ని సమానంగా చూస్తోందని, అధికార పార్టీ ఎమ్మెల్యే ఉన్నా.. ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యే ఉన్నా.. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించడంలో ఎలాంటి వివక్షకు తావులేదని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పోచారంలో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు రంగారెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి రాష్ట్ర పరిశ్రమలు ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ... హైదరాబాద్‌లో భూముల విలువ ఎకరాకు వందల కోట్ల రూపాయలు ఉన్నప్పటికీ, పేదలు నివసించే ప్రాంతాల్లోనే వారికి గౌరవప్రదమైన నివాసం కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. నగరంలో జీవనోపాధి పొందుతున్న పేదలను దూర ప్రాంతాలకు తరలించి వారి ఉపాధికి ఇబ్బందులు కలిగించే విధానానికి స్వస్తి పలుకుతున్నామని తెలిపారు. ట్యూర్ పరిధిలో మొదటి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామని, 23 నియోజకవర్గాల్లో పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియను పూర్తి చేశామని వెల్లడించారు. ఇప్పటికే ఆరు చోట్ల ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి శంకుస్థాపనలు చేశామని వివరించారు. మేడ్చల్ నియోజకవర్గంలో తొలి విడతగా 480 మంది లబ్ధిదారులను పారదర్శకమైన బహిరంగ డ్రా ద్వారా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, ఇప్పటికే సొంత ఇల్లు ఉన్నవారిని గుర్తించి, అర్హతలను ధ్రువీకరించిన అనంతరం పారదర్శకంగా డ్రా నిర్వహించామని చెప్పారు.

## గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన విద్యార్థులు



**జనోదయ : రామగిరి:**

హైదరాబాద్‌లో 1,212 మందితో జరిగిన కరాటే ప్రదర్శనలో పాల్గొని ప్రపంచ గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన రామగిరి మండల విద్యార్థులు లొంకాకేసరం మాజీ సర్పంచ్ ఎండి.మంజూర్ మనుమరాలు మహమ్మద్ ఆఫిఫా ఫాతిమా,ఎడ్ల రిషికేశ్ వీరికి నేడు రామగిరి ఎస్.ఐ చేతుల మీదుగా తల్లిదండ్రుల సమక్షంలో గిన్నిస్ సర్టిఫికెట్లు అందజేశారు. శిక్షణ ఇచ్చిన ద్రోణాచార్య స్పోర్ట్స్ అకాడమి కల్వచర్ల కరాటే మాస్టర్ మారుపాక సంపత్‌కు చిన్నారుల తల్లిదండ్రులకు అభినందనలు తెలియచేసారు.

# వ్యవసాయ భూమిలోని ప్లాట్లు కొనుగోలు చేయొద్దు

### అధికారులు బోర్డు ఏర్పాటు



**జనోదయ : అందోల్**

అందోల్ మండల పరిధిలోని పోసానిపేట శివారులోని వ్యవసాయ భూమిలో ప్లాట్లు కొనుగోలు చేయొద్దు అంటూ అధికారులు బోర్డులు ఏర్పాటు చేశారు. గ్రామ శివారులోని సర్వే నెంబర్ 255 లోని మూడు ఎకరాల ఎనిమిది గుంటలను ప్రభుత్వ నిబంధనలకు ప్లాటు చేసి విక్రయాలు జరిపారు. ఈ భూమిని నాన్ అగ్రికల్చర్ ల్యాండ్ గా మార్పు చేయకుండానే గ్రామపంచాయతీ అనుమతులు లేకుండానే ప్లాట్లుగా చేసి అధికారులను తప్పుదో వపట్టించి అడ్డ గోలుగా విక్రయాలు జరిపి సొమ్ము చేసుకుంటున్నారు. అంతేకాకుండా కొందరు గ్రామపంచాయతీ పర్మిషన్ లేకుండానే నిర్మాణాలు చేపట్టారు. ఈ విషయం పై కలెక్టర్ పంచాయత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఈ భూమిలో ఎలాంటి రిజిస్ట్రేషన్లు చేయకూడదని సబ్ రిజిస్టర్ అధికారులకు కూడా ఆదేశాలు జారీచేశారు. ఇంకా ఎవరైనా ప్రజలకు తెలియాలని అధికారులు బోర్డు కూడా ఏర్పాటు చేశారు. ప్రజలు ఈ భూమిపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

# రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించాలి

### చైర్మన్ గాజుల మహేష్



**జనోదయ : శంకరపట్నం**

శంకరపట్నం మండలం మెట్‌పల్లి ప్రాథమిక వ్యవ సాయ సహకార పరపతి సంఘం పరిధిలోని ఆము దాలపల్లి, మెట్టుపల్లి, లింగాపూర్, కొత్తగట్టు, గొల్లపల్లి, కన్నాపూర్, మొలంగూర్ గ్రామాల్లో బుధవారం ముందస్తుగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు సొసైటీ చైర్మన్ గాజుల మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు తాము పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందాలని సూచించారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని విక్రయించి లబ్ధి పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఈఓ సదయ్య, సింగిల్ విండో డైరెక్టర్లు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.